# ప్రజాశక్తి

ఆదివారం 27 జులై 2025

5

శ్రీసత్యసాయి

## టేకులోడులో భూసేకరణపై గ్రామసభ

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని టేకులోడు గ్రామంలో శనివారం భూసేకరణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ మేరకు పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహశీల్దార్ నటరాజ్, ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ శ్రీనివాసరావు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూములకు ఎకరాకు రూ. 12,66,000 నష్టపరిహారం ప్రకటించారు. దీంతో గ్రామంలోని 60 శాతం రైతులు సానుకూలంగా స్పందించగా, మిగిలిన రైతులు ఈ ధర తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. భూముల విలువ మరింత ఎక్కువగా ఉండేలా నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమయంలో విలేకరులు వీడియోలు తీస్తుండగా శ్రీనివాసరావు తీయొద్దని అనడం వివాదాస్పదంగా మారింది. కార్యక్రమంలో ఆర్ఐ నేలకోటప్ప, టేకులోడు విఆర్ఓ అశ్వత్థప్ప, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైందని ఎమ్మెల్యే పిఎ శ్రీనివాసరావుకు గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన శ్రీనివాసరావు ఖర్చు తానే భరిస్తానని తెలిపారు. బోర్ వేసే అంశంపై అధికారులతో చర్చిస్తామని తెలిపారు.



# స్మార్ట్ బాదుడు..!

విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తరువాత జనంపై విద్యుత్ భారాల మోత మోగుతోంది. ముఖ్యంగా చిరువ్యాపారులపై ఈ భారం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో వచ్చేదానికంటే 30 నుంచి 40 శాతం వరకు అదనపు బాదుడు ఉంటోంది. ఈ బాధుడు చిరువ్యాపారులపై తీవ్రంగా పడుతోంది. విద్యుత్ ఛార్జీల స్మార్ట్ బాదుడుపై ప్రజల నుంచి సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.




◆ పెరుగుతున్న విద్యుత్ భారాలు

◆ జనంపై అదనపు భారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ (రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సర్వీస్ సెక్టార్) పేరుతో గతంలో ఉన్న విద్యుత్ పంపిణీ, నిర్వహణ బాధ్యతలను అదానీ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ ఇప్పుడు అనంతపురం జిల్లాలోనూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ నష్టాన్ని మరింత పక్కాగా లెక్కగట్టేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చింది. దీనికింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం జరిగే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా కేటగరి -2 కిందనున్న వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోంది. ఇప్పటికే 80 వేల వరకు స్మార్ట్‌మీటర్ల బిగింపు కార్యక్రమం జరిగింది. వీటికి వస్తున్న బిల్లులు చూస్తే వినియోగదారుల్లో గుబులు మొదలైంది. 30 శాతం వరకు విద్యుత్ బిల్లుల భారం పడుతోంది.

గూగూడులో ఇక్బాల్ భాషా అనే వ్యక్తి స్మార్ట్ మీటర్ ఏర్పాటు తర్వాత వచ్చిన బిల్లు

**చాపకింద నీరులా స్మార్ట్ మీటర్లు బిగింపు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం చాపకింద నీరులా ప్రవహిస్తోంది. మొన్నటి వరకు వ్యాపార సంస్థలకే బిగిస్తూరాగా, తాజాగా ఇళ్లకు బిగించడం మొదలు పెట్టారు. ప్రధానంగా పెద్ద భవనాలకు ఈ మీటర్లు బిగిస్తున్నారు. అవి కూడా ఒకేసారి అపార్టుమెంట్‌లోని అన్ని ప్లాట్లకు కాకుండా ఒకటి, రెండు ప్లాట్లకు బిగించడం తరువాత క్రమక్రమంగా బిగిస్తూ పోతున్నారు. దీనివల్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని మాత్రం ప్రభుత్వం ఆపడం లేదు.

### 25 శాతానికి పైగా అదనంగా బాదుడు

అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఓ వ్యక్తి బ్లూస్టార్ సెలూన్ షాపు నిర్వహిస్తున్నారు. స్మార్టు మీటరు అమర్చకముందు ఇతని షాపునకు నెలకు రూ.2500 వరకు బిల్లులు వచ్చేవి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అనంతరం రూ.3500 నుంచి నాలుగు వేలకుపైగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. గడిచిన రెండు నెలల బిల్లులు చూస్తే ఈ విధంగానున్నాయి. మే నెలలో వేసవి కాలం కావడంతో 411 యూనిట్లు వాడారు. దానికి అయ్యే విద్యుత్ ఛార్జీ రూ.3528 వచ్చింది. కస్టమర్ ఛార్జీస్, ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ ఛార్జీస్ అన్నీ కలిపి రూ.4668 అయింది. ఇక జూన్ నెలలో 291 యూనిట్లు వినియోగించారు. దీనికి విద్యుత్ ఛార్జీలు రూ.2381 కాగా అదనపు ఛార్జీలు కలిపి మొత్తం రూ.3268 అయింది. ఇదే రకమైన వినియోగంపై గతంలో రూ.2500 వరకు మాత్రమే బిల్లు వచ్చేదని నిర్వాహకుడు వాపోయాడు.

**గతంలో రూ.400.. ఇప్పుడు రూ.704 వచ్చింది ..!**

నార్పల మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో ఇక్బాల్ బాషా అనే వ్యక్తి మోటరు వైండింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతడికి గత నెలలో స్మార్టుమీటరు బిగించారు. ఇది బిగించక ముందు నెలకు రూ.400 వరకు బిల్లు వస్తుండగా ఇప్పుడు రూ.700పైగా వచ్చింది.

# జనంపై విషరసాయనం.!

◆ పట్టించుకోని కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు

◆ కాలుష్య కోరల్లో పారిశ్రామిక వాడ ◆ కాంట్రాక్టర్లకు అధికార పార్టీ వత్తాసు

◆ ఏ పార్టీ వస్తే ఆ పార్టీకే కాంట్రాక్టు..!

**హిందూపురం పారిశ్రామిక వాడలో కొన్ని రసాయన పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను ఆరుబయటే పారేస్తూ జన జీవనాన్ని విషతుల్యం చేస్తున్నాయి. పరిశ్రమ యజమానులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సలాం కొడుతూ వారికి పనులను పనులను అప్పగిస్తున్నారు. అధికారంలో ఉన్న నేతలు కూడా ధనార్జనే ధ్యేయంగా ఉంటూ ప్రజల ఆరోగ్యాలను గాలికొదిలేస్తున్నారు. రసాయన వ్యర్థాలతో ఓ వైపు జనం ఆరోగ్యం దెబ్బతింటుండగా మరో వైపు సారవంతమైన భూములు నిసారమై ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.**

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పారిశ్రామిక వాడలో పలు రసాయన పరిశ్రమలు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు విషపూరితంగా ఉంటాయి. ఈ వ్యర్థాలను నిబంధలు పాటిస్తూ అనేక జాగ్రత్తల నడుమ ఇతర ప్రాంతలకు తరలించాలి. ఇదంతా ఖర్చుతో కూడుకున్నది కావాడంతో పరిశ్రమల నిర్వాహకులు అడ్డదారులు వెతుకుంటున్నారు. వ్యర్థాలను తరలించే పనిని ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులకు అప్పజెప్పుతున్నారు. నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎక్కడబడితే అక్కడ విష రసాయాలను పారేస్తున్నారు. దీంతో హిందూపురం పారిశ్రామిక వాడతో పాటు సమీప గ్రామాల భూములు కాలుష్య కోరల్లో చిక్కుకొంటున్నాయి. కమికల్ పరిశ్రమలు, స్టీల్ పరిశ్రమలు వెదజల్లే పొగ, దుర్వాసనకు పారిశ్రామిక వాడ పరిధిలోని గోళాపురం, గుడ్డంపల్లి, దేవరపల్లి తదితర గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు దీర్ఘకాలిక జబ్బులబారిన పడుతున్నారు.

**భూమిపైనే రసాయన వ్యర్థాలు**

తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడలో 8 రసాయన, 22 వరకు స్టీల్ పరిశ్రమలున్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు భూమిలోపు సుమారు 50 అడుగులు తవ్వి అందులో వేసి పూడ్చాలి. ఇందుకు డబ్బు ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడంతో పరిశ్రమ నిర్వాహకులు అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఏజెంట్లుగా మారి పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాన్ని ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఊరికి దూరంగా దీనిని పారవేస్తున్నారు. ఇది పారవేసిన తర్వాత దీని వాసన ఆ సమీప ప్రాంతాల వరకు విస్తరిస్తోంది. దీంతో

చెరువును తలపిస్తున్న రసాయన వ్యర్థాలు

**చెరువు కాదు.. రసాయన వ్యర్థం..!**

ఈ ఫొటోలు కన్పిస్తున్నది చెరువు నీరు అనుకుంటున్నారేమో. మనుషులు ప్రాణాలను తీసే విష రసాయనం. హిందూపురం పారిశ్రామిక వాడలోని రసాయన పరిశ్రమ నుంచి వెలువడిన విషతుల్య రసాయనాన్ని ఇలా ఆరుబయట పారవేశారు. దీని వాసన పీల్చినా వెంటనే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి విషద్రావణాన్ని నిత్యం పురం పారిశ్రామిక వాడ నుంచి తీసుకుని వచ్చి ఇలా పారవేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులెవరూ నోరెమెదపకపోవడం గమనార్హం.

గుంత తీసి వేసిన రసాయన వ్యర్థాలు

పాటు రసాయన వ్యర్థం పడిన ప్రాంతం అంతా నిస్సారం అవుతోంది. కనీసం దానిపై పిచ్చిమొక్క కూడా మొలవడం లేదు. కాలువల ద్వారా రసాయన నీరు మురుగు నీటిలో కలిసి తూముకుంట గ్రామంలోకి చేరుతోంది. ఈ నీరు భూమిలో ఇంకి బోరుబావుల నుంచి వచ్చే నీరు కలుషితంగా మారుతోంది. ఈ నీరు తాగి గతంలో మేకలు, గొర్రెలు కూడా మత్యువాత పడ్డాయి. ఇంతా జరుగుతున్నా కాలుష్య నియంత్రణ, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో ఈ సమస్యను ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో తీసుకువచ్చింది. ఆ సమయంలో కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ మునిప్రసాద్ తనఖీలు నిర్వహించారు. మరో నెల రోజుల్లో ప్రత్యేక కమిటీలు వేసి, నిరంతరం దీనిపై పర్యవేక్షిస్తామని చెప్పారు. ఆ మాటలు గాలిమాటలుగా మారాయి.

# అడవికి అదానీ కాటు..!

◆ కనుమరుగవుతున్న పచ్చదనం

◆ మొక్కలు నాటాలన్న ఒప్పందానికి తిలోదకాలు

కొండలోని చెట్లపై వేసిన మట్టి కుప్పలు

ప్రజాశక్తి-తాడిమర్రి

'అదానీ హైడల్ పవర్ ప్రాజెక్ట్' నిర్మాణంలో భాగంగా అదానీ కంపెనీ 1 టిఎంసి సామర్థ్యంతో మండలంలోని దాడితోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామ సరిహద్దుల్లో అప్పర్ రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టింది. అందులో భాగంగా అక్కడి నుంచి తొలగిస్తున్న రాళ్లు, మట్టిని అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రాంతంలో కాకుండా కొండవాలు ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా వదిలేస్తున్నారు. దీంతో కొండలో పచ్చదనం మొత్తం కనుమరగయ్యే దుస్థితి నెలకొంది. పెద్దమొత్తంలో రాళ్లు, మట్టి తరలించడంతో పెద్ద పెద్ద చెట్లు సైతం వాటి కింద పడి అంతరించిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే త్వరలోనే పచ్చదనంతో కళకళలాడే కొండలు కనిపించకుండా చేస్తారేమో అని గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు అదానీ కంపెనీ సుమారు 2 లక్షల మొక్కలు నాటాల్సి ఉందని, కానీ ఆ కంపెనీ యాజమాన్యం అలాంటి చర్యలేవీ చేపట్టడం లేదని తెలుస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అదాని కంపెనీ అతిక్రమిస్తున్న చర్యలను నియంత్రించి, అడవులు, పర్యావరణాన్ని కాపాడాలని పెద్దకోట్ల గ్రామస్తులు, గొర్రెలకాపరులు కోరుతున్నారు.

డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని, స్టేటస్ వల్ల వేతనాలు రాని ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులు బోధన కంటే బోధనేతర పనులకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా యోగా, మెగా పేరెంట్స్ మీటింగ్, శిక్షణ తరగతుల పేర్లతో ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతున్నారన్నారు. విద్యాశాఖకు సంబంధం లేని పి-4 విషయాలను కూడా ఉపాధ్యాయులపై మోపుతున్నారన్నారు. ఆయా భారాలు తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులు సెలవులు ఉపయోగించుకునే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధించడం తగతన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. అనంతరం డిఈఓ ఎడి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు బాబు, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహిర్‌వలి, లక్ష్మీనారాయణ, శివశంకర్, కిష్టప్ప, రామాంజనేయులు, మాలింగప్ప, రాజగోపాల్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్‌కె సిబ్బంది రూ.10 లక్షలు స్వాహా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని 10 రైతు సేవా కేంద్రా లను శనివారం జిల్లా అధికారిణి గీతమ్మ సందర్శిం చారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన ఎరువులు, విత్తన కాయల పంపిణీలో అగ్రికల్చర్ సిబ్బంది రూ. 10 లక్షలు స్వాహా చేసినట్లు తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. ఇక్కడి నుంచి వేరే మండలాలకు బదిలీపై వెళ్లిన వారిని రిలీవ్ చేయవద్దని ఏవో లోకేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు.

# మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

## మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. పట్టణంలో నూగూరులో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో 72 మంది మహిళలు 90 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా ఉన్న 5000 మంది మహిళలకు 10 శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణను ఇప్పించి వారికి ఉచితంగా కుట్టు మిషన్ అందించే కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రీకారం చుట్టారన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకట లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి హనుమంతు, మోదా శివ, టిఎంసీ గంగులయ్య, మెప్మా సీవోలు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

## జూడో జాతీయ పోటీలకు అష్టల్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని చిగిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అష్టల్ మహారాజ్ జూడో క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం తిమ్మారెడ్డి తెలిపారు. ఇటీవల భోపాల్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో అష్టల్ మంచి ప్రతిభ చూపి నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(భోపాల్) పోటీలకు ఎంపికయ్యాడన్నారు. దేశవ్యాప్తంగా 45 మంది ఎంపిక కాగా ఎపి నుంచి అష్టల్ మహారాజ్ ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక**

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి ఎంకె.నిఖిల్‌కుమార్ ఉమ్మడి అనంత పురం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్-19 జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వై.ప్రశాంతి తెలిపారు. ఈ విద్యార్థి ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని పిడి నాగేంద్ర తెలిపారు. నిఖిల్‌ను ఎస్ఎస్ఎన్ ఆఫీసర్ సి.కుళ్లాయిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, పి.మురళి, అధ్యాపక బృందం అభినందించారు.

## రాహుల్‌గాంధీకి దేశాన్ని పాలించే అర్హత ఉంది

### సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ప్రజలు అధికారం ఇస్తే దేశాన్ని పరిపాలించే అన్ని అర్హతలు రాహుల్‌గాంధీకి ఉన్నాయని సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓబీసీ సదస్సులో రాహుల్ చాలా అద్భుతంగా మాట్లాడారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు రావాలని కోరారన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో, రాష్ట్రంలో పేదలకు రిజర్వేషన్లతో సహా అన్ని హక్కులు అందేలా చట్టం తీసుకొచ్చిందన్నారు. అగ్రవర్ణాల పేదలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనార్టీలను ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా ఉన్నత స్థాయికి తీసుకురావాలనే తపన రాహుల్ గాంధీలో నెలకొందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన జరగాలని పట్టుబట్టడంతో కేంద్రం దిగివచ్చిందన్నారు. తెలంగాణలో చేపట్టిన దాని కంటే మెరుగైన రీతిలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

## అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి :డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎస్ఎస్ఎలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు ఈ నెల 28 నుంచి ఆగస్టు 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్షణ అధికారి, డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. మున్సి పల్ యాజమాన్యం పాఠశాలల్లో పని చేస్తున్న స్కూ ల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు(55ఏళ్ల లోపు) అర్హులన్నారు. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, ఆల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్, ప్లానింగ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబైలేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రా మింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను బుక్కపట్నంలోని సమగ్ర శిక్షణ కార్యాలయంలో అందజేయాలన్నారు.

# జిల్లాలో నేరాలు తగ్గుముఖం

## ఎస్పీ వి.రత్న

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గడచిన ఆరు నెలల కాలంలో నేరాలు తగ్గాయని ఎస్పీ వి.రత్న తెలియజేశారు. గడిచిన ఆరు నెలలకు సంబంధించి క్రైమ్ రివ్యూను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే 27 శాతం నేరాలు తగ్గాయన్నారు. హత్యలు, హత్యాయత్నం కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. నేర నియంత్రణలో భాగంగా జిల్లాలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. జనం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఇబ్బందులు పాలు కాకుండా అవగాహన కార్యక్రమాలను విస్తతం చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు గతంతో పోలిస్తే చాలా తగ్గాయన్నారు. చోరీలను అరికట్టేందుకు రాత్రి గస్తీలు పెంచామన్నారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులకు సంబంధించి చాలా వాటికి పరిష్కారం చూపామని తెలియజేశారు. నేరాలు ఎక్కువగా జరిగే టాప్-10 పోలీస్ స్టేషన్లను గుర్తించామని అవసరం మేరకు అక్కడ సిబ్బందిని కేటాయించనున్నట్లు తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల నేరాలకు సంబంధించి కాస్త కేసులు పెరిగినప్పటికీ వాటిని పరిష్కరించేందుకు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపుతోందని తెలియజేశారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల నేరాలకు పాల్పడే వారికి చట్టపరంగా శిక్ష పడేలా చూస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే అర్జీలపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పరిష్కారం చూపుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికి పి-4 తోడ్పాటు

### బంగారు కుటుంబాల మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-లేపాక్షి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 కార్యక్రమం పేదల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. శనివారం ఉదయం లేపాక్షి మండలం పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ కార్యాలయం పి-4 పాలసీ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల గుర్తింపు తదితర వాటిపై గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పి-4పై అవగాహన కల్పించారు. గ్రామంలోని విద్యావంతులు, ఎన్నారైలు, ఉద్యోగులు, సంపన్నులు పి-4లో భాగస్వామ్యం అయ్యి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, దాతలు కలిసి పనిచేసే భాగస్వామ్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పేదలకు అన్ని విధాలా తోడ్పాటు అందించే అవకాశం ఉందన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులందరూ ఇందులో భాగస్వాములుగా మారి పి-4ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంగ లక్ష్మమ్మ, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపిడిఒ నరసింహ మూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, విఆర్ఎ గంగరత్నమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీసత్యసాయి

# ఎమ్మెల్యే దృష్టికి ప్రజాసమస్యలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. ఆమె శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి మండలం లోని బండ్లపల్లి పంచాయతీలో పర్యటించారు. ముందుగా వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు వితంతు పింఛన్లు అందలేదని, తల్లికి వందనం వర్తించలేదని, భూములు ఆన్‌లైన్ చేయడంలో సమస్యలు ఉన్నాయని, గృహ నిర్మాణ బిల్లులు కావడం లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని మొరపెట్టుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర

**సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణస్వీకారం**

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలో శనివారం బండ్లపల్లి సహకార సంఘం అధ్యక్షులుగా బైరాపురం గ్రామానికి చెందిన బెస్త శంకర, డైరెక్టర్లుగా శీన, నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు, డైరెక్టర్లను వారు అభినందిం చారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ నామినేటెడ్, స్థానిక సంస్థల్లో పదవులు దక్కుతాయన్నారు. నాయకులు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీని వాసులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శివప్రసాద్, నాయకులు ఎస్.శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, బైరాపురం సర్పంచి రవి, సహకార సంఘం కార్యదర్శి రామాంజనేయులు, కిష్టప్ప, కేశప్ప, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, సురేష్, సుధాకర్ ఉన్నారు.

# ప్రమాదకరంగా తరలింపు

ప్రజాశక్తి-రొద్దం

ఆటో డ్రైవర్లు ప్రమాదకర రీతిలో వస్తువులను రవాణా చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా శనివారం రొద్దం ప్రధాన రహదారిపై ఓ ఆటోలో పెద్ద పెద్ద ఇనుప వాకిళ్లు తరలించడం కనిపించింది. దీనికి తోడు వారు ఎలాంటి ప్రమాద సూచికలు లేకుండా, జాగ్రత్తలు పాటించకుండా నిబంధనలకు వ్యతిరేకంగా చాలా పొడవైన, బరువైన ఇనుప వస్తువులను తరలించడంపై వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఆటోల్లో ఇలాంటి వస్తువులు రవాణా చేస్తున్నా పోలీసు, ఆర్‌టిఒ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఆటోలో ఇనుప తలుపులను తరలిస్తున్న దృశ్యం

# ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని డబురువారిపల్లెలో శనివారం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించి చైతన్యపరుతులను చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ముందుకెళ్లాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సమిష్టిగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, రాజునాయుడు, రామసుబ్బారెడ్డి, నిస్సార్‌అహ్మద్, షామీర్‌బాషా, జగన్మోహన్‌చౌదరి, రఫీక్, గోవిందు, కోళ్ల కృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు ఏమయ్యాయి..? : వైసిపి

ప్రజాశక్తి-లేపాక్షి

ఎన్నికల హామీలు ఏమయ్యాయని హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసిపి మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొండూరు, కల్లూరు, మానేపల్లి పంచాయతీల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దీపిక గడప గడపకూ వెళ్లి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్-సిక్స్‌తో పాటు హామీలను గాలికి వదిలేశారని ప్రజలకు వివరించారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమనించి రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి సమన్వయకర్త దీపిక

కోరారు. కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు మల్లన్న, రామాంజనప్ప, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి, చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామంలో నిరసన తెలుపుతున్న మహిళలు

# తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి-తలుపుల

**చిలమత్తూరు :** మండలంలోని తుమ్మల కుంట గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ స్తులు, నాయకులు సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బోర్లలో కొద్దిగా నీరు వస్తున్నా కొందరు మోటార్ల ద్వారా నీటిని తోడేస్తున్నారని, దీంతో మిగిలిన ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యదర్శి లేకపోవడంతో బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# టిడిపితోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్షులు హెచ్‌ఎన్.రాము పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమాన్ని రాము ఆధ్వర్యంలో రూరల్ మండలం చౌళూరు పంచాయతీలో శనివారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి ఈ ఏడాది పరిపాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అశ్వర్థ నారాయణ రెడ్డి, అరుణాచల రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, ఐటీడీపీ రామాంజి, శ్రీరాములు, ప్రదీప్, సర్పంచులు చెకిరప్ప, మంజు, హనుమంతు, టిజి.నాగరాజు, ఉమ్మశంకర్ రెడ్డి, ఎంపీటీసీ శివ, మాజీ ఎంపీటీసీలు అంజి, ప్రకాష్, రామచంద్ర, శంకర్, మదన్ గోపాల్ రెడ్డి, అంజిన్ రెడ్డి, రఫీద్, వెంకటరమణప్ప, బాబు, అది నారాయణప్ప, నగేష్, భరత్ స్వామి, మల్లప్ప, శివప్ప, మూర్తి, వేణు, సంజుండప్ప పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహను పెంపొందించుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ సమాచార హక్కు చట్టం దాని ఉపయోగాల గురించి తెలియజేశారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం తెలుసుకోవచ్చున్నారు. దరఖాస్తుదారుడు కోరే సమాచారాన్ని ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా॥రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుడ్డం కోనేరు పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని గుడ్డం కోనేరును మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ త్వరలో జరగనున్న గణేష్ నిమజ్జనం కోసం గుడ్డం కోనేరును ఇప్పటి నుంచే పరిశుభ్రంగా ఉంచే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోనేరులో ఉన్న చెత్త చెదారాన్ని తీసి, కోనేరును పూర్తిగా నీటితో నింపి, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట మున్సిపల్ ఇంజినీర్ దస్తగిరి, సచివాలయ ఎమ్యూనిటీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

# కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిషేధం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇకపై కలెక్టరేట్ వద్ద ఆందోళనలను నిషేధించినట్లు శనివారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన రహదారిలో కలెక్టరేట్, సత్యసాయి విద్యాసంస్థలు ఉండడంతో ఆందోళనలు చేయడం వల్ల విద్యార్థులు, భక్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కలెక్టరేట్ వద్ద ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, తదితర ఆందోళన లను నిషేధించినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ఎసుములపల్లి సమీపంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేశామని అక్కడ నిర్వహించుకోవచ్చు అని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు, వివిఐపిలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

# ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

**నల్లచెరువు :** ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈవో మురళీకృష్ణ, అర్చకులు నాగరాజు, ఆంజనేయదాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఏర్పాట్లను, అన్న దాన కేంద్రాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి దంపతులు ఉన్నారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు

**ధర్మవరం రూరల్ :** మండలంలోని బడన్నపల్లి గ్రామ ఎంపియుపి పాఠశాలలో శనివారం ఆప్తాల్మిక్ డాక్టర్ ఉరుకుందప్ప, హెల్త్ సూపర్వైజర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు కంటికి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏఏ ఆహార పదార్థాలు తింటే కంటిచూపు మెరుగవుతుంది, తదితర విషయాల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కంటి చూపును నిర్లక్ష్యం చేయకుండా బాల్యం నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్త అలివేలమ్మ పాల్గొన్నారు.

# కమ్యునికేషన్ స్కిల్స్ అవసరం

**ధర్మవరం రూరల్ :** ప్రతి ఒక్కరికీ కమ్యునికేషన్ స్కిల్స్ అవసరమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకులు పావని చంద్రన్, శ్రీవాణి చంద్రన్ తెలిపారు. ఈ సంస్థ ద్వారా ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి శనివారం సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ 13 రోజుల పాటు జరిగిన ఈ కోర్సులో 60 మంది కోర్సు పూర్తి చేశారని తెలిపారు. ఎవరితో ఏవిధంగా మాట్లాడాలి, స్టేజ్‌పై భయం లేకుండా ఎలా మాట్లాడాలి, బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలి, వాయిస్ మాడ్యులేషన్ ఎలా ఉండాలి, తదితర అంశాల్లో యోగా మాస్టర్ కె.చంద్రశేఖర్, భువనేశ్వరి శిక్షణ ఇచ్చారన్నారు.

# క్షయ వ్యాధిపై అవగాహన

**పుట్టపర్తి రూరల్ :** మండలంలోని మార్తపల్లి గ్రామంలో శనివారం పుట్టపర్తి పిహెచ్‌సి డిటిసిబి సూపర్వైజర్ అబీద్‌బాషా అవగాహన ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గుతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధిని ఎవరూ నిర్లక్ష్యము చేయరాదన్నారు. వైద్యసేవలు, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

# అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

అనారోగ్య కారణాలతో ఇంట్లోనే ఉరి వేసుకొని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం సోమందేపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక దుర్గానగర్‌లో సిరివెళ్ల ముస్తఫా, కాసింబీ దంపతులు కుమార్తె రేష్మతో కలిసి నివాసం ఉంటున్నారు. రేష్మకు వివాహం కాలేదు. వైసిపి హయాంలో వాలంటీర్‌గా పని చేసి ప్రజలతో మంచి పేరు తెచ్చుకుంది. టిటిసి పూర్తి చేసిన రేష్మ ఇటీవల డీఎస్సీ పరీక్షలు కూడా రాసింది. ఆమె రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనే కండరాల వ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతుంది. చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రేష్మ 'నాన్న మీరు కష్టపడి సంపాదించి ఎంత ఖర్చు పెట్టినా నా వ్యాధి నయం కాదు.. నన్ను మన్నించండి' అని ఉత్తరం రాసి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన వెంటనే జమేదారు సుధాకర్‌నాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# హొన్నంపల్లిలో చోరీ

**పరిగి :** మండలంలోని హొన్నంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం వెంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమల వెళ్లారు. ప్రవీణ్‌కుమార్ బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. దొంగలు శనివారం అర్ధరాత్రి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ. 42వేల నగదుతో పాటు పది తులాల వెండి నగలు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు ప్రవీణ్‌కు సమాచారం ఇవ్వడంతో మధ్యాహ్నం వారు ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీంచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# 'మీ సమస్య-మా బాధ్యత'కు సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సంజయ్‌నగర్‌లో బడి సత్రం పాఠశాల, గాంధీనగర్‌లోని మున్సిపల్ పాఠశాల వద్ద రెండో రోజైన శనివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమం నిర్వహించగా ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో శ్రీరామ్‌తో పాటు మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. పరిటాల శ్రీరామ్ ప్రజల సమస్యలు విని ప్రతి అర్జీని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యతను స్థానిక నాయకులకు అప్పగించారు. శ్రీరామ్ మాట్లాడుతూ చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నదే మా ఉద్దేశ్యం అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం

ప్రజలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

కోసం మంత్రి సత్యకుమార్‌తో పాటు అధికారులతో కలిసి కూర్చొని చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, నాగూర్ హుస్సేన్, వార్డు ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

# కెహెచ్ డిగ్రీ కళాశాలలో ఆధునిక కోర్సులు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కాశెట్టి హరిదాసులు (కెహెచ్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధునిక కోర్సులు అందు బాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.ఎ, బి.కాం, బీ.ఎస్సీ కంప్యూటర్ కోర్సులు అన్నాయని, తరగతి గదులు డిజిటల్ బోధనకు అనుకూలంగా ఏర్పాటు చేశామన్నారు. ఆధునిక సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, ఆర్ఒ వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌సిసి, పోలీస్, డిఫెన్స్, ఆర్‌పిఎఫ్, తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. అధునాతన సామగ్రితో జిమ్ ఉందన్నారు. జవహర్ నాలెజ్జి కేంద్రం సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని తెలిపారు.

# కొండూరు సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కొండూరు సహకార సంఘం నూతన కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షులుగా నరసింహులు, డైరెక్టర్లుగా చిదంబరంరెడ్డి, శివప్ప ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బాలకృష్ణ కోర్దినేటర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు రైతులకు అందుబాటులో ఉండి అర్హులైన రైతులకు ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వం సబ్సిడీపై అందించే పరికరాలు అందించాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్

కొండూరు సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నాయకులు

అభిలాష్, జయప్ప, ఆనంద్‌కుమార్, నాగరాజు, రామాంజనమ్మ పాల్గొన్నారు.

# డ్రెయినేజీలపై నిర్మాణాలు చేపడితే చర్యలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

డ్రెయినేజీ కాలువలపై ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి సూచించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లిలో ప్రధాన కూడళ్లు, రహదారి పక్కన మురుగు కాలువలపై వ్యాపారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. కాలువలపై ఏర్పాటు చేసిన ప్లేట్లను సైతం మూసివేశారన్నారు. దీంతో డ్రెయినేజీ కాలువల్లో మురుగునీరు ముందుకు వెళ్లడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనికి తోడు పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలు శుభ్రం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

# ఫిజియోథెరపీ వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో శనివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్, సంస్థ సభ్యుడైన కేతా లోకేష్ తండ్రి జ్ఞాపకార్థం ఫిజియోథెరపీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాధితులకు మోకాళ్ల నొప్పులకు అవసరమైన మందులు, సలహాలు ఇచ్చారు. యువర్స్ ఫౌండేషన్ తరపున పోలా ప్రభాకర్ నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. గ్రామంలో నాగమ్మను నేత్రదానం కార్యకర్తగా నియమించారు. ఫిజియోథెరపీ వైద్యుడు రవితేజ, జూబ్లీ కేర్ డయాగ్నస్టిక్ అధినేత డాక్టర్ జగదీష్, ఆరోగ్య కార్యకర్త అరుణ సేవలు అందించారు. కేతా లోకేష్ కుర్చీలు అందజేశారు. అనంతరం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ సామాజిక విభాగం సలహాదారులు సత్యనిర్ధారణ అధ్యక్షతన స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు అయ్యన్నకు నివాళులర్పించారు. శిబిరంలో విన్సెంట్ ఫెరర్ హెల్త్ క్యాంపు ఆర్గనైజేషన్ కార్యదర్శి అశోక్, ఉప కార్యదర్శి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కోటి గురుమూర్తికి నివాళి

ప్రజాశక్తి-బత్తలపల్లి

కోటి గురుమూర్తి 35వ వర్ధంతి వేడుకలను శనివారం స్థానిక కోటి గురుమూర్తి స్మృతివనంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గురుమూర్తి ఘాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు కోటి గురులక్ష్మి, ఎంపిటిసి కోటి నరేష్‌కుమార్, మల్లీశ్వరి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, మమత, తదితరులు ఘాట్‌పై పూలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాకే సురేష్, లోకేష్, తలారి సోము, గవ్వల రమేష్, కొంకా ప్రసాద్, కుమ్మర కిష్టప్ప, పామాల నారాయణస్వామి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బహుజన చైతన్య వేదిక నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-పరిగి

స్థానిక బీరలింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో శనివారం బహుజన చైతన్య వేదిక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శివరామకృష్ణ హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా పి.నరసాపురం పంచాయతీకి చెందిన నరేష్, కార్యదర్శులుగా సురేష్, నరేష్, గౌరవాధ్యక్షుడిగా కిష్టప్ప, నరసింహమూర్తి, గోపాల్‌ను ఎన్నుకున్నారు. శివరామకృష్ణ మాట్లాడుతూ బహుజన చైతన్య వేదిక ద్వారా అన్ని కులాలను ఒకే వేదికపై తీసుకొవచ్చి ఏకం చేయాలనే ఉద్దేశంతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కమిటీ సభ్యులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు రామానుజప్ప, నాగార్జున, రొద్దం బాబుప్రసాద్, రవికుమార్, గోళాపురం అంజి, రామదాస్, బీచిగానిపల్లి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌ను సన్మానిస్తున్న బహుజన చైతన్య వేదిక కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

# స్పందన 'కరువు'..!

అధికారంలో ఏ పార్టీ ఉన్నా అన్న దాతకు అండగా ఉంటామని చెబుతుంటారు. ఆచరణలో మాత్రం ఆన్నదాతల కష్టాలు ఎక్కడి వక్కడే అన్న చందంగా ఉంటాయి. ఇప్పుడు కూడా ఒకవైపు ప్రకృతి వైపరిత్యం, మరోవైపు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికీ 30 శాతం కూడా పంట సాగవలేదు. 70 శాతం బీడు భూములే ఉన్నాయి. ఇంతటి తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నా పాలకులు దీనిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఖరీఫ్ విత్తనం విత్తుకోవడానికి ఇదే ఆఖరి గడువు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్న ప్రకారమైనా ఆగస్టు మూడవ తేదీలోపు మంచి వర్షాలొస్తే వేరుశనగ విత్తుకోవచ్చు. లేకపోతే ఇతర పంటల వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలే ఆధారం కానున్నాయి. ఆ రకమైన ఏర్పాట్లు ఇంతవరకు జరుగుతున్న దాఖలాల్లేవు. జిల్లా ప్రజాప్రతినిదులు కూడా రైతాంగ సమస్యలను పట్టించుకున్న దాఖలాల్లేవు. తొలిఅడుగు అంటూ ఇంటింటికీ ప్రజాప్రతినిధులు వెళ్తున్నారు. మరోవైపు మంత్రులు విచ్చేసి బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లోనూ రై